క్లుప్తంగా

క్లాప్ వాహనాల పరిశీలన



రైల్వేస్టేషన్ ప్రాంతంలో క్లాప్ వాహనాలను పరిశీలిస్తున్న జెడ్సీ ఆర్‌జీవీ కృష్ణ

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలి, రైల్వేస్టేషన్ రోడ్డు, భారతీయ ఆహార గిడ్డంగి రహదారి, జ్ఞానాపురం రైల్వేస్టేషన్, బీఆర్‌టీఎస్ రహదారుల్లో చెత్త తరలించే క్లాప్ వాహనాలను గురువారం జోన్–5 జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఆయన పర్యటించి చెత్త తరలింపు ప్రక్రియలో సమయ పాలన పాటించాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. పలు వీధుల్లో పర్యటించి తడిపొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు. సచివాలయ శానిటరీ కార్యదర్శులు ఫ్రైడే–డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీవీఎస్ఎస్ఎం ప్రసాద్, సూపర్‌వైజర్ అర్జున్, సచివాలయ శానటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ధనుంజయ్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : విశాఖ వెల్డింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు ధనుంజయ్ అనారోగ్యంతో మృతి చెందడంతో అసోసియేషన్ సభ్యులు ధనుంజయ్ కుటుంబాన్ని గురువారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ధనుంజయ్‌కి ఇద్దరు కుమార్తెలు కావడంతో కళాశాల చదువుల కోసం అసోసియేషన్ సభ్యులు సేకరించిన రూ.91,500 అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పి. రఘు, కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి విజయ్, కోశాధికారి మోహన్, కన్వీనర్ ప్రసాద్, సలహాదారుడు కృపాకర్ పాల్గొన్నారు.

స్కీం ఇళ్లకు మరమ్మతు చేయాలి



ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

జగదాంబ : కన్వేయర్ బెల్ట్ ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను వెంటనే మరమ్మతు చేయిస్తామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 39వ వార్డులో పర్యటిస్తున్న ఆయనకు స్థానికులు తమ ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలపడంతో ఆయన వారి ఇళ్లు పరిశీలించారు. ఇళ్లు శ్లాబ్‌లతో పాటు పలు చోట్ల పెచ్చులూడిపోతున్న వైనం గమనించారు. వెంటనే జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడి తక్షణం ఇళ్లకు మరమ్మతు చేయాలని కోరారు. కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ట్రస్టీ బెహరా వెంకటరత్నం, జీవీఎంసీ 38వ వార్డు ప్రెసిడెంట్ సన్యాసిరావు పాల్గొన్నారు.

అంతర కళాశాల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఎంవీపీ కాలనీ: ప్రతిభా–2023 అంతర్ కళాశాలల పోటీల్లో ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పలు పోటీల్లో విజేతలుగా నిలిచి బహుమతులు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రజని, డైరెక్టర్ ఆచార్య అయ్యంగారి ఆనంద్ విజేతలను అభినందించారు.

మార్కెట్లకు శ్రావణ శోభ

- ఇసుకేస్తే రాలనంత జనం
- అరటి పండ్లు, పూల ధరలకు రెక్కలు
- పోలీసుల పర్యవేక్షణతో సజావుగా కొనుగోళ్లు.. అమ్మకాలు



గాజులు కొనుగోలు చేస్తున్న భక్తులు



పూర్ణామార్కెట్‌లో పువ్వుల కొనుగోలుకు కిక్కిరిసిన జనం



పూజా సామగ్రి అమ్ముతున్న మహిళ



పండ్లు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

జగదాంబ : పూర్ణామార్కెట్ శ్రావణ శోభ సంతరించుకుంది. శ్రావణమాసం రెండో శుక్రవారం పూజల నేపథ్యంలో గురువారం నగర ప్రజలతో పూర్ణామార్కెట్ కిక్కిరిసిపోయింది. రైతుబజార్లు ఉన్నప్పటికీ పూర్ణామార్కెట్‌కు అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు. వ్యాపారులు ఇదే అదనుగా సొమ్ము చేసుకున్నారు. శ్రావణమాసం పూజల సందర్భంగా గురువారం అరటిపండ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. డజను రూ. 100 కంటే అధిక ధరకు విక్రయిస్తున్నారు. కాస్తోకూస్తో కొబ్బరికాయల ధరలు మాత్రం అందుబాటులో ఉన్నాయి. ఎప్పటిలాగే పువ్వులు ధరలూ పెరిగాయి. యాభై గ్రాముల పువ్వులు రూ.150కి విక్రయిస్తున్నారు. పూజల నేపథ్యంలో పూర్ణామార్కెట్‌లో పత్రి, వస్త్ర, గాజుల దుకాణాలు బారులుతీరాయి. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు ముందస్తుగా రహదారిని బారికేడ్లతో మూసివేసి రహదారిని డైవర్ట్ చేశారు. దీంతో మార్కెట్‌లో అమ్మకాలు, కొనుగోళ్లు ప్రశాంతంగా సాగాయి.

జేబుదొంగల బారిన పడకుండా..

వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు, జేబుదొంగల బారి నుంచి రక్షణ కల్పించారు. ఎక్కడికక్కడ నిఘా ఏర్పాటు చేశారు. జేబుదొంగలను కనిపెట్టేందుకు పోలీసులు మఫ్టీలో నిఘా వేశారు. మార్కెట్‌లో రద్దీ ఎక్కువగా ఉండటంతో వాహనాల రాకపోకలను వేరే దారిలోకి మళ్లించారు. పెద్ద వాహనాలు మార్కెట్‌లోకి రాకుండా చర్యలు తీసుకున్నారు. రహదారిపై అనధికార దుకాణాలు పెట్టకుండా కట్టడి చేశారు. దీంతో గురువారం మార్కెట్‌కు పెద్ద సంఖ్యలో జనం వచ్చినప్పటికీ ప్రశాంతంగా అమ్మకాలు, కొనుగోళ్లు జరిగాయి.

అల్లిపురంలో..

అల్లిపురం : అల్లిపురం మహాత్మాగాంధీ మార్కెట్, రామకృష్ణ మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మహిళలు శ్రావణలక్ష్మి పూజల కోసం పెద్ద ఎత్తున మార్కెట్‌కు రావటంతో దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది. పూజా సామగ్రి ధరలు ఆకాశాన్ని అంటాయని భక్తులు వాపోయారు. చామంతి పూలు డజను రూ.30, కొబ్బరికాయ సైజుల వారీగా రూ.30 నుంచి రూ.50, అరటి పండ్లు డజను రూ.60 నుంచి రూ.80, యాపిల్ సైజుల వారీగా రూ.100కి 3 నుంచి 4, బత్తాయిలు 10, దానిమ్మకాయలు 3 నుంచి 4, అరిటాకు ఒకటి రూ.5కు విక్రయించారు.



మార్కెట్లో ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న ఎస్సై భాస్కరరావు

ప్రతి ఏటా పూర్ణామార్కెట్‌కి వస్తాం..



రైతు బజార్లున్నా శ్రావణం పూజల కొనుగోళ్లకు ఏటా పూర్ణామార్కెట్‌కే వచ్చి పూజాసామగ్రి కొనుగోలు చేసుకుంటాం. ఇక్కడే కలువపూలు, కావలసిన సరకులు దొరుకుతాయి. అన్నీ ఒకేచోట సులువుగా దొరకటం వల్ల అందరూ ఇక్కడికే వస్తారు.

–సూర్యకుమార్ దంపతులు, మద్దిలపాలెం

కావలసినవన్నీ ఒకేచోట దొరుకుతాయి..



ధరలు ఎక్కువగా ఉన్నా పూజకు కావలసిన వస్తువులన్నీ ఒకే దగ్గర దొరుకుతాయి. పక్కనే ఉన్న పందుపుల్లల సందులో జాకెట్ ముక్కలు దొరుకుతాయి. ప్రతి ఏటా మేం వరలక్ష్మీ వ్రతం సామగ్రికి ఇక్కడికే వస్తాం.

– నాగమణి, జాలరిపేట

అభివృద్ధి పనుల పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో ఇటీవల సుమారు కోటి రూపాయల వ్యయంతో శంకుస్థాపన చేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వార్డు వైఎస్సార్‌సీ సీనియర్ నాయకుడు, జేసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ జోన్–5 ఇంజినీరింగ్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. వార్డులో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొద్ది రోజులుగా మంచినీరు కలుషితమై బురద, దుర్వాసనతో సరఫరా అవుతోందని స్థానికులు తెలిపారు. సమస్యలను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ సతీష్, చాందిని, ప్రవీణ్, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు పాల్గొన్నారు.

వివేకానంద సంస్థలో చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్

జగదాంబ : శ్రావణమాసం సందర్భంగా మహిళలకు స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ చీరలు పంపిణీ చేశారు. సంస్థలో అలుపెరుగని సేవలందిస్తున్న మహిళలకు చీరలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇదే విధంగా నిరంతరం సంస్థకు సేవలందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సత్తిబాబు, మహిళా సభ్యులు సుజాత, రత్న, నాగమణి, భవాని, రాణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర తులసి పూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి



ఎమ్మెల్యే వాసుపల్లికి ప్రసాదం అందజేస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి గురువారం నిర్వహించే సహస్ర తులసిపూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 చెల్లించి పూజలో పాల్గొనవచ్చు. అలాగే అమ్మవారి త్రికాల పంచామృతాభిషేకం సేవలో 26 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించి పూజలో పాల్గొనవచ్చు.

శ్రావణమాసం ప్రత్యేక కుంకుమ పూజలు..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణమాసం పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మీ పూజలు గురువారం 8వ రోజుకి చేరాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పూజలో 16 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణమాసం నెల రోజులు నిర్వహించే శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పూజలో పాల్గొనవచ్చని, పూజా సామగ్రి దేవస్థానమే సమకూరుస్తుందని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ఈ పూజలో పాల్గొనే ఉభయదాతలకు శేషవస్త్రంగా కండువా, జాకెట్టు ముక్క, రాగి స్టాండు యంత్రం, ప్రసాదం అందజేయనున్నట్టు చెప్పారు. ఈ పూజలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు గురు, శుక్రవారాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, తిరిగి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు రెండు సార్లు నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. పరోక్షంగా పూజలో పాల్గొనాలనుకున్న భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు పూజా రుసుం జమచేసి, పేరు గోత్రం, చిరునామా వివరాలు 89855 15989 వాట్సప్ నంబరుకు పంపాలి. ఆన్‌లైన్ సేవలు/పూజల టికెట్లు aptemples.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా లభిస్తాయి.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే..

ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అమ్మవారికి ఆయనచే ప్రత్యేక పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



సత్యవతి కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : గత ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతుల మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పలువురికి ఆర్థికసాయం చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త ఎండాడ సురేష్ పెద్దమ్మ కదిరి సత్యవతి (55) అనారోగ్యంతో మంచానికే పరిమతం అయ్యారు. వీరి కుటుంబ పోషణ కష్టంగా ఉందని ప్రజాదర్బార్‌లో తెలియజేయటంతో ఎమ్మెల్యే వాసుపల్లి రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే 38వ వార్డు బుక్కా వీధికి చెందిన ఒమ్మి శ్రీనివాస్ (37) అనారోగ్యంతో మంచానికే పరిమితం కావటంతో అతని కుటుంబానికి రూ. 5 వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఒక మీడియా ప్రతినిధికి మందుల కోసం రూ. 5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ నియోజవర్గ పరిధిలో పార్టీ కార్యకర్తలు ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే తనకు చెబితే ఆదుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ట్రస్టీ బెహరా వెంకటరత్నం, జీవీఎంసీ 38వ వార్డు ప్రెసిడెంట్ సన్యాసిరావు, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, వార్డు మహిళా ప్రెసిడెంట్ సారిపిల్లి అరుణ, సీనియర్ నాయకులు ఆదివిష్ణు, ప్రసాద్, బాబ్జి పాల్గొన్నారు.

10న ప్రతిఘటన సదస్సు



ప్రతిఘటన సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత విముక్తి ప్రతినిధులు

సీతమ్మధార : దళిత విముక్తి 25 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం నేపథ్యంలో సెప్టెంబర్ 10వ తేదీన సదస్సుతో పాటు ఊరేగింపు నిర్వహించనున్నట్లు దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలోని ఆర్అండ్‌బీ సమీపంలో గల అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రతిఘటనా సదస్సు, సాయంత్రం 4 గంటలకు సభాస్థలి నుంచి ఎస్‌డీ కొత్త రోడ్డు వరకు ఊరేగింపు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా మాజీ యూపీఎస్సీ సభ్యులు, పూర్వ ద్రావిడ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఎస్.చలం, ఏయూ ప్రొఫెసర్ పీడీ సత్యపాల్, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబటి నాగయ్యతో పాటు పలువురు హాజరవుతారని అన్నారు. గత 25 ఏళ్లుగా దళిత విముక్తి కులనిర్మూలన, మతోన్మాదం, దళితులపై దాడులు, భూ సమస్య తదితర అంశాలపై పోరాడుతుందని తెలిపారు. బి.సన్యాసమ్మ, కె.రవి, యు.శివ, కె.కుమార్ పాల్గొన్నారు.

ప్రధాన అర్చకుడు అప్పాజీ మృతి



రమేష్ అప్పాజీ (ఫైల్)



అప్పాజీ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న శిరీష

మహారాణిపేట : సూర్యాబాగ్ శ్రీ విశ్వేశ్వరస్వామి దేవాలయం ప్రధాన అర్చకుడు బాదంపూడి రమేష్ అప్పాజీ (53) గురువారం మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో అప్పాజీని ఆస్పత్రిలో చేర్పించినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ చనిపోయారు. గురువారం ఉదయం అప్పాజీ మృతదేహానికి దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కె.శిరీష పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అప్పాజీ మృతి అర్చక సంఘానికి తీరని లోటు అని ఉత్తరాంధ్ర జిల్లా అర్చక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అయిలూరి శ్రీనివాస దీక్షితులు, కొత్తలంక మురళీకృష్ణ అన్నారు.

రాజేష్‌కు డాక్టరేట్

మహారాణిపేట : ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అర్జి రాజేష్‌కి డాక్టరేట్ లభించింది. ఆచార్య పేకేటి ప్రేమనందం పర్యవేక్షణలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో 'రోల్ ఆఫ్ ఈ–గవర్నెన్స్ ఇన్ రూరల్ డెవలప్‌మెంట్– ఎ స్టడీ ఆఫ్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్' అనే అంశంపై రాజేష్ విజయవంతంగా పరిశోధన చేశారు. గురువారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద్ రెడ్డి తన ఛాంబర్‌లో రాజేష్‌కి పీహెచ్‌డీ ప్రొసీడింగ్ అందించి అభినందించారు. ఆచార్య పి.ప్రేమనందం, హెచ్‌వోడీ ఆచార్య వీర్రాజు, ఇతర ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు రాజేష్‌ను అభినందించారు.

కిక్ బాక్సింగ్‌లో రితీష్‌కు పతకాలు



రితీష్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీధర్, ప్రిన్సిపాల్ జోగిరాజు

సీతంపేట: ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో ద్వారకానగర్ బీవీకే కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న రితీష్ దాస్ సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. ఈ సందర్భంగా గురువారం రితీష్‌ను కళాశాల కరస్పాండెంట్ శ్రీధర్, ప్రిన్సిపాల్ జోగిరాజు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

సిరిపురంలో ఆర్టీసీ పార్శిల్ కౌంటర్



పార్శిల్ కౌంటర్ వద్ద ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

బీచ్ రోడ్డు: ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు అందుబాటు ధరల్లో లభ్యమవుతున్నట్లు సంస్థ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. వాల్తేరు డిపో ఆధ్వర్యంలో సిరిపురంలోని 900కే బస్టాప్‌లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ పార్శిల్ కౌంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, ఎంవీపీ, మద్దిలపాలెం కాంప్లెక్స్, తదితర ప్రాంతాల్లో పార్సిల్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. తక్కువ ఖర్చుతో పార్శిల్స్‌ను ఆర్టీసీ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్టు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్తేరు డిపో మేనేజర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి థాంక్స్ టూ సాక్షి

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధుడు



వృద్ధుడు నాగరాజును అతని కోడలు లక్ష్మికి అప్పగిస్తున్న ప్రగడ వాసు

అల్లిపురం : ఈ నెల 19వ తేదీన ఆర్కే బీచ్‌లో పడి ఉన్న వృద్ధుడు నాగరాజుని టూరిజం కానిస్టేబుల్, మహారాణిపేట కానిస్టేబుళ్లు రక్షించారు. అతనికి భీమ్‌నగర్ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి ఆశ్రయం కల్పించారు. ఈనెల 21న సాక్షి పత్రికలో 'వృద్ధుడికి ఆశ్రయం' పేరిట ప్రచురితమైన కథనం చూసిన నాగరాజు కుటుంబ సభ్యులు గురువారం ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి వచ్చి కార్యదర్శి ప్రగడ వాసును సంప్రదించారు. దీంతో సిబ్బంది వృద్ధుడిని అతని కోడలు లక్ష్మికి అప్పగించారు. ఈ సందర్భంగా వారు సాక్షికి, నిరాశ్రయ వసతి గృహ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

సెల్యూట్ టు ఇస్రో



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దాబాగార్డెన్స్ : చంద్రయాన్–3 విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం సెల్యూట్ టు ఇస్రో పేరిట విజయయాత్ర (ర్యాలీ) నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని సెల్యూట్ టు ఇండియా–సెల్యూట్ టు ఇస్రో.. వంటి నినాదాలతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాలల ఉత్తరాంధ్ర సంచాలకుడు పి. రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కదారి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ బాబ్జి, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. భాస్కరరావు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అభినందనలు తెలిపారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

సీతమ్మధార: అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ అధికారులతో జరిగిన ఒప్పందం ప్రకారం పబ్లిక్ హెల్త్‌లో డ్రైవర్లు, వెటర్నరీ, మలేరియా, యూజీడీ కార్మికులకు హెల్త్ అలవెన్స్, ఇంజినీరింగ్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, మున్సిపల్ యూనియన్ నాయకులు కృష్ణారావు, అప్పలరాజు, రాజు, శ్రీదేవి పాల్గొన్నారు.

మారథాన్‌లో బుల్లయ్య కళాశాల విద్యార్థి ప్రతిభ



వంశీకృష్ణను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: దేశ స్వాతంత్ర్యానికి 76 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 14న వైజాగ్ రన్నింగ్ అసోసియేషన్ నిర్వహించిన 76 కిలోమీటర్ల అల్ట్రా మారథాన్‌లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థి కె.వంశీకృష్ణ ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా గురువారం వంశీకృష్ణను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. రేసులో నలుగురు క్రీడాకారులతో పాటు బీఎస్సీ సెకండియర్ చదువుతున్న వంశీకృష్ణ కూడా పాల్గొన్నాడు. 14వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు నోవాటెల్ వద్ద మారథాన్ ప్రారంభించి 15వ తేదీ ఉదయం 5 గంటలకు ముగించారు.